సాక్షి ప్రకాశం

బుధవారం । 3 । జనవరి । 2024



సాంకేతిక సృజనాత్మకత తప్పనిసరి

విద్యా వ్యవస్థలో సాంకేతిక సృజనాత్మకత తప్పనిసరి అని ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. - 8లో..



ప్రకృతి వ్యవసాయ సర్టిఫికెట్‌తో మేలు

ప్రకృతి వ్యవసాయ గుర్తింపు సర్టిఫికెట్‌తో రైతులకు మరింత ఉపయోగకరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి పేర్కొన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/21

వాతావరణం

ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

20న నవోదయ ప్రవేశ పరీక్ష

ఒంగోలు: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారానే తమ హాల్‌టిక్కెట్లను పొందాలన్నారు. జవహర్ నవోదయ విద్యాలయం ఒంగోలు ప్రిన్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కార్యాలయం పనిదినాల్లో తమ కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తు రశీదులను అభ్యర్థులు తమ వెంట తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు కె.రామిరెడ్డి ప్రిన్సిపాల్ 9481837230, ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ 8638682701 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గాలికుంటు వ్యాధి టీకాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశంభవనంలో ఈ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పశువులకు టీకాలు వేయాలన్నారు. గాలికుంటు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఈ వ్యాక్సిన్ ఉపకరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 32వ విడత టీకా కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర సదస్సు

ఒంగోలు సిటీ: ఒంగోలు రామనగర్‌లోని ప్రజా సంకల్ప వేదిక కార్యాలయంలో ఈ నెల 7వ తేది ఆదివారం రాష్ట్రంలోని 26 జిల్లాల ముఖ్యమైన సభ్యులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎవేర్‌నెస్, భవిష్యత్ ప్రణాళిక సంబంధించి చర్చించనున్నట్లు మదిరె రంగసాయిరెడ్డి పేర్కొన్నారు.

7న పూర్వ విద్యార్థుల సమావేశం

ఒంగోలు: స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక పాఠశాల ఆవరణలో ఈనెల 7వ తేదీ నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో ముఖ్యంగా పాఠశాల శతాబ్ది మహోత్సవాల నిర్వహణపై చర్చిస్తామన్నారు. కనుక పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో పాలుపంచుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు అంజిరెడ్డి 9440242802, కారుమూడి ఆంజనేయులు 9866461153, షిరాజ్ 9848366920 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సరికొత్తగా..

ఒక వైపు మెడికల్ కళాశాల పనులు జోరుగా సాగుతున్నాయి..మరో వైపు మార్కాపురం జిల్లా అస్పత్రికి ఆధునిక వసతులు సమకూరుతున్నాయి. అలాగే జిల్లా ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వచ్చే ఏడాది నుంచి మెడికల్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. కొత్తగా వచ్చే విద్యార్థుల ప్రాక్టీస్ కోసం అదనంగా 230 బెడ్లను జిల్లా వైద్యశాలలోనే ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 28 మంది ప్రొఫెసర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వైద్యానికి సంబంధించి రానున్న రోజుల్లో పశ్చిమ ప్రకాశానికి మార్కాపురం కేంద్రంగా మారనుంది.

- మార్కాపురం జిల్లా వైద్యశాలలో జోరుగా అభివృద్ధి పనులు
- 230 బెడ్స్ ఏర్పాటుకు వేగంగా పనులు
- రూ. 8 కోట్లు కేటాయింపు
- 28 మంది ప్రొఫెసర్ల నియామకం
- 600లకు పెరిగిన ఓపీ



జిల్లా వైద్యశాలలో అదనపు బెడ్ల నిర్మాణ పనులు

మార్కాపురం: మార్కాపురం జిల్లా ఆస్పత్రికి మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. వచ్చే ఏడాది నుంచి మార్కాపురంలో మెడికల్ కాలేజీ అడ్మిషన్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వైద్య విద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం మొత్తం 330 బెడ్లను సిద్ధం చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించడంతో అందుకు తగిన విధంగా జిల్లా వైద్యశాలలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆస్పత్రిలో 100 పడకలు ఉండగా, 230 అదనపు బెడ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లను కేటాయించింది. రెండు నెలలుగా పనులు వేగంగా సాగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా బెడ్ల ఏర్పాట్ల పనులు పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

28 మంది ప్రొఫెసర్ల నియామకం

వైద్యారోగ్య శాఖ మార్కాపురంలో వచ్చే ఏడాది నుంచి ప్రారంభించనున్న మెడికల్ కళాశాలకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే 28 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మార్కాపురానికి బదిలీ చేసింది. వారంతా ఇక్కడ రిపోర్టు చేశారు. ఇందులో క్లినికల్, టీచింగ్ విభాగాలుగా విభజించి ప్రొఫెసర్లను నియమించింది. క్లినికల్ విభాగంలో 18 మందిని అందుబాటులోకి తెచ్చింది. ఒంగోలు, గుంటూరు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి మార్కాపురానికి బదిలీ చేసింది. ఇదిలా ఉండగా జిల్లా వైద్యశాలలో పనిచేస్తున్న పలువురు స్పెషలిస్టు వైద్యులను అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించనుంది. జనవరి మొదటి వారంలో మరో 10 దాకా అసిస్టెంటు ప్రొఫెసర్లు రానున్నారు. నియమితులైన వారిలో ఆర్థోపెడిక్స్, ఫిజిషియాలజీ, బయో కెమిస్ట్, న్యూరాలజీ, డెర్మటాలజీ తదితర విభాగాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజీకి సంబంధించి మొత్తం 222 మంది సిబ్బందిని నియమించనున్నారు. కాగా ఇప్పటికే జిల్లా వైద్యశాలలో దాదాపు 35 మంది వైద్యులు ఉండటంతో సేవలు విస్తృతమయ్యాయి.

పెరిగిన ఓపీ

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మార్కాపురం ఆస్పత్రిని నిర్లక్ష్యం చేసింది. చిన్నపాటి అనారోగ్య సమస్య తలెత్తినా పక్క జిల్లాలకు, సుదూర ప్రాంతాలకు పరుగెత్తాల్సి వచ్చేంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితంగా వైద్యానికి మార్కాపురం హబ్‌గా మారనుంది. ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో పశ్చిమ ప్రకాశంతో పాటు నంద్యాల జిల్లా శ్రీశైలం, దర్శి, కనిగిరి ప్రాంతాల నుంచి కూడా పలువురు చికిత్స కోసం మార్కాపురం జిల్లా వైద్యశాలకు వస్తున్నారు. టీడీపీ హయాంలో ఓపీ రోజుకు 80 నుంచి 100 ఉండగా అప్పుడు డాక్టర్లు 8 మంది మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం డాక్టర్ల సంఖ్య 35 మందికి చేరుకుంది. నర్సింగ్ సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చింది. మందుల కొరత లేకపోవడంతో ప్రతిరోజూ 600 నుంచి 700 వరకూ ఓపీ ఉంటోంది. ఆరోగ్యశ్రీ కూడా జిల్లా వైద్యశాలలో అమలుచేస్తున్నారు.

జోరుగా కళాశాల నిర్మాణ పనులు

రాయవరం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో రూ. 475 కోట్లతో చేపట్టిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా 100 సీట్లు రానున్నాయి. నర్సింగ్ కాలేజీ, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటివారంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఇక్కడికి రానున్నారు. ఈలోపే పనులన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ



వడివడిగా అదనపు బెడ్ల నిర్మాణం: మార్కాపురం జిల్లా వైద్యశాలలో మొత్తం 330 బెడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రూ.8 కోట్లు కేటాయించారు. ఇప్పటికే జిల్లా వైద్యశాలలో 100 బెడ్లు ఉండగా మరో 230 బెడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నాం.

– డాక్టర్ సుబ్బారెడ్డి,
మెడికల్ సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల

జగనన్న ఆరోగ్య సురక్షలో

అలసత్వం వద్దు

- మొదటి విడతలో కోటి మందికి పైగా వైద్య పరీక్షలు
- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్

మద్దిపాడు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో అలసత్వం వహించవద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ అన్నారు. మండలంలోని మల్లవరంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శిబిరంలో పరీక్షించిన ప్రతి ఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే మొదటి విడత వైద్య శిబిరాల నిర్వహణ పూర్తయిందని, మరింత మందికి వైద్య సేవలందించేందుకు రెండో విడత శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో కోటి మంది శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. రెండో విడతలో నైపుణ్యం కలిగిన వైద్యులు శిబిరాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆశావర్కర్, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు విధిగా గృహ సందర్శనలు చేసి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ ప్రతిఒక్కరి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. కంటి పరీక్షల నిమిత్తం వచ్చిన ఒంటరి వృద్ధురాలితో మాట్లాడగా.. కంటి ఆపరేషన్‌కు తనకు ఎవరూ తోడు లేరని చెప్పడంతో తోడు ఇచ్చి పంపుతామని ధైర్యం చెప్పి చర్యలు తీసుకోవాలని స్థానిక వైద్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. తొలుత కలెక్టర్ దినేష్‌కుమార్ మల్లవరంలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 92 రకాల మందులను రోగులకు ఉచితంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో స్పెషలిస్టు వైద్యులు గుర్తించిన తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా చికిత్స అందించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ పి.సరళమ్మ, డీఎంహెచ్‌ఓ ఎస్ రాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మూర్తి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ హేమంత్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత, ఆరోగ్య సురక్ష కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయ నోడల్ అధికారి ఉషారాణి, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆశాజ్యోతి, సర్పంచ్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పారదర్శకంగా ఓటరు జాబితా

- ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు పక్కా చర్యలు చేపట్టినట్లు ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. ఆర్‌డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిశీలిస్తున్నామని, ఎన్నికల సంఘం నిర్దేశించినట్లు జనవరి 22వ తేదీ ఓటరు జాబితా విడుదల చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజిత, మున్సిపల్ కార్పొరేషన్ ఏసీపీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు సంజీవ్, స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

అక్రమ లే అవుట్లపై కఠిన చర్యలు

- జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలోని అక్రమ లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో సంక్షేమం, అభివృద్ధి అంశాలపై మంగళవారం మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా నిర్మించే భవనాల అనుమతులను మాన్యువల్‌గా ఇవ్వకూడదన్నారు. అనుమతులకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు ఉండాలన్నారు. అనుమతులు లేకుండా వేసిన లే అవుట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. వీటికి సంబంధించి ఇప్పటికే లే అవుట్ యజమానులకు నోటీసులు పంపినట్లు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 రోజులు, హౌసింగ్ లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలు కచ్చితంగా కల్పించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సచివాలయాల సిబ్బంది ఉదయం, సాయంత్రం రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రభుత్వ సేవలకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మరన్ అలీ, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ కొండయ్య, మెప్మా పీడీ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, బీసీ సంక్షేమ అధికారి అంజల, డీఈఓ సుబ్బారావు, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ శీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

యర్రగొండపాలెం ఇన్‌చార్జిగా

తాటిపర్తి చంద్రశేఖర్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఇన్‌చార్జిగా తాటిపర్తి చంద్రశేఖర్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. సింగరాయకొండ పంచాయతీ సుందర్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ విద్యావంతుడు, వ్యాపారవేత్త, బిల్డర్, హెచ్‌ఎస్‌సీ సంస్థల అధినేతగా గుర్తింపు సాధించాడు. అతని తల్లిదండ్రులు హుస్సేన్, చెంచమ్మ, భార్య భాగ్యసీమ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహణలో చంద్రశేఖర్‌కు మంచి గుర్తింపు ఉంది. వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, ఆలయాలు, చర్చిలు, మసీదులకు విరాళాలు, క్రీడల ప్రోత్సాహకానికి ఆర్థిక సాయం, నిరుపేదల అంత్యక్రియలకు ఆర్థికసాయం, పేద వధూవరులకు తాళి బొట్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేవారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన చురుగ్గా పాల్గొని పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. పార్టీ అధికార ప్రతినిధిగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో యర్రగొండపాలెంలో భారీ మెజారిటీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులందరినీ కలుపుకుని పార్టీ విజయానికి పాటుపడతానని తెలిపారు. తాటిపర్తిని యర్రగొండపాలెం ఇన్‌చార్జిగా ప్రకటించగానే అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

చెంచుల అభ్యున్నతికి చర్యలు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో చెంచులు నివాసం ఉంటున్న ప్రాంతాలు, వారి జీవన ప్రమాణాలు అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ చేపట్టిన జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ఉపకరిస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం భవనంలో జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. దీనిలో 11అంశాలకు సంబంధించి హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు, మొబైల్ం మెడికల్ యూనిట్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టల్స్, మల్టీ పర్సస్ సెంటర్స్, మొబైల్ టవర్‌ల ఏర్పాటు తదితర అంశాలపై లైన్‌డిపార్టుమెంట్లతో సమీక్షించి పలు సూచనలిచ్చారు. కేంద్రం నిర్దేశించినట్లు చెంచుల ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై జనవరి 15వ తేదీలోగా నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీడీ రవీంద్రరెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి జన్నార్థరావు, నోడల్ అధికారి సాయికుమార్, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ అలీ, తహశీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

క్లుప్తంగా

రేపు సింగరాయకొండలో మంత్రి సురేష్ పర్యటన

సింగరాయకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథి పాల్గొంటారని ఎంపీడీఓ షేక్ జమీఉల్లా ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ పింఛను కానుకను రాష్ట్ర ప్రభుత్వం రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచిన సందర్భంగా ఈ నెల 8వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పింఛనుదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

లాడ్జిలో వ్యాపారి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలోని ఓ లాడ్జిలో వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వన్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. సీఎస్ పురం మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాజా రహ్మతుల్లా(46) గత కొద్ది రోజులుగా గుంటూరు నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. డిసెంబర్ 30న ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. 31వ తేదీ రాత్రి గదిలోని సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుని మరణించారు. గది నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గమనించిన లాడ్జి సిబ్బంది మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బందితో అక్కడకు చేరుకున్న వన్ టౌన్ ఎస్సై మురళి గది తాళాలు పగలగొట్టి చూడగా రహ్మతుల్లా ఉరికి వేలాడుతున్నాడు. మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ సాయంతో గుంటూరులోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వ్యాపారం కలిసి రాక అప్పులపాలైన రహ్మతుల్లా చివరికి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాంకేతిక సృజనాత్మకత తప్పనిసరి

- ఎయిడెడ్ కాలేజీలు న్యాక్‌కు వెళ్లాల్సిందే
- ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్


డాక్టర్ పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కళ్యాణి

ఒంగోలు: విద్యా వ్యవస్థలో సాంకేతిక సృజనాత్మకత తప్పనిసరి అని ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జోనల్ రివ్యూ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కాలేజీలు న్యాక్‌కు వెళ్తున్నాయని, ఎయిడెడ్ కాలేజీలు కూడా తప్పనిసరిగా న్యాక్‌కు వెళ్లాల్సిందే అని స్పష్టం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో డిజిటలైజేషన్ విజయవంతంగా పూర్తి చేయగలిగామన్నారు. త్వరలోనే ఎయిడెడ్ కాలేజీలు కూడా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఐమ్యాప్, ఎఫ్ యాప్, టీఎల్‌పీ, జాబ్ పోర్టల్ యాప్, జ్ఞానభూమి యాప్‌తోపాటు అల్యూమినీ, అసెస్‌మెంట్ యాప్‌ను కూడా ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థకు సాంకేతిక సృజనాత్మకత అవసరమని పేర్కొంటూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ పొందిన డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, న్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, స్టాఫ్‌ను అభినందించారు. సమావేశంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని 26 ప్రభుత్వ, 22 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆర్జేడీ డాక్టర్ జ్యోత్స్నకుమారి అధ్యక్షత వహించగా, ఏజీవో డాక్టర్ తులసి మస్తానమ్మ కార్యనిర్వాహకురాలిగా వ్యవహరించారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన శిద్దా



ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత శిద్దా రాఘవరావు, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాజ్యసభ్య సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డితోనూ భేటీ అయ్యారు.

ప్రకృతి వ్యవసాయ గుర్తింపు సర్టిఫికెట్‌తో మరింత మేలు


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయాధికారి సుభాషిణి

- ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి

ఒంగోలు సెంట్రల్: ప్రకృతి వ్యవసాయ గుర్తింపు సర్టిఫికెట్‌తో రైతులకు మరింత ఉపయోగకరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ, ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయదారులకు పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టమ్ ఆఫ్ ఇండియా(పీజీఎస్)సర్టిఫికెట్‌పై మంగళవారం ఒంగోలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్గానిక్ ఇండియా, గ్రీన్ ఇండియా సర్టిఫికెట్లు పొందిన రైతులు తమ ఉత్పత్తులను ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు రూపొందించిన ప్రత్యేక యాప్ గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర ఆర్‌పీలు వెంకటరావు, సత్యసాయి, రాజేష్, సత్యనారాయణ, ఎస్ఎఫ్‌ఏ, ఎంటీ, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులు తీవ్ర కష్టాలుపడుతున్నట్లుగా ఒక దినపత్రికలో వచ్చిన వార్త(సాక్షిలో కాదు) పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రైవేట్ భవనంలో హాస్టల్ నిర్వహిస్తున్నామని, మొత్తం 48 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతి విద్యార్థికి ప్లేటు, గ్లాసు, ట్రంకు పెట్టి జూన్‌లోనే ప్రభుత్వం అందించిందన్నారు. కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు రాష్ట్రంలో ఎక్కడా కూడా మంచాలు ఇవ్వరన్నారు. మార్కాపురంలోని వసతి గృహంలో 3 స్నానపు గదులు విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉన్నాయన్నారు. ప్రతి రూములో కూడా ఫ్యాన్లు, లైట్లు ఉన్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు సక్రమంగా సరఫరా అవుతున్నాయని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని, ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయిస్తున్నామని వివరించారు. వసతి గృహం పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు.

చెరకు తోట దగ్ధం

- రూ.2 లక్షలు నష్టం


కాలిపోయిన చెరకు తోట

మార్కాపురం రూరల్: ఓ వ్యక్తి తన పొలంలో పిచ్చిమొక్కలను తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగసిపడి పక్కనే ఉన్న చెరకుతోట దగ్ధమైంది. ఈ సంఘటన మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామ పొలాల్లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహబూబ్‌వలి తన పొలంలో ఉన్న పిచ్చికంపను తగలబెడుతుండగా నిప్పు రవ్వలు పక్కనే ఉన్న జనుమాల ప్రసాద్ సాగుచేస్తున్న చెరకుతోటలో పడ్డాయి. మంటలు చెలరేగడంతో చెరకు తోట పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అగ్ని ప్రమాదం వల్ల సుమారు 2 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎడ్ల పోటీల్లో విజేత బోయినవారిపాలెం

చీరాల టౌన్: రాష్ట్రస్థాయి పోలురాధా ఎడ్ల పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు బహుమతులు పంపిణీ చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలోని ఈపూరుపాలెం పంచాయతీ బోయినవారిపాలెంలో సోమవారం నిర్వహించిన ఎడ్ల పోటీల్లో బోయినవారిపాలెం ఎడ్ల జత ప్రథమస్థానంలో నిలిచింది. మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఎడ్ల పోటీల్లో నిర్ణీత 10 నిముషాల వ్యవధిలో బోయినవారిపాలేనికి చెందిన ఎడ్ల జత 3500 అడుగులు దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది. ఈపురుపాలేనికి చెందిన దేవరపల్లి చంద్రరావు ఎడ్లు 3487 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో, ఈపురుపాలేనికి చెందిన బాల వెంకటేశ్వర్లు ఎడ్లు 3046 అడుగులు లాగి తృతీయ స్థానంలో, చినగంజాం సోపిరాలకు చెందిన వీరయ్య ఎడ్లు 3429 అడుగులు లాగి నాలుగో స్థానంలో, వేటపాలేనికి చెందిన బి.కోటేశ్వరరావు ఎడ్లు 3176 అడుగులు లాగి ఐదో స్థానంలో, పొట్టిశ్రీరాములు నెల్లూరుకు చెందిన సంతోష్‌రెడ్డి ఎడ్లు 3715 అడుగులతో ఆరో స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ.15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాలుగో బహుమతిగా రూ.7,116, ఐదో బహుమతిగా రూ. రూ.5,116, ఆరో బహుమతిగా రూ.3,116 అందజేశారు. పోటీలను వీక్షించడానికి అధిక సంఖ్యలో పశుపోషకులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో ఏపీజీబీ

- రీజినల్ మేనేజర్ యూసఫ్ అలీ



ఒంగోలు టౌన్: ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రగతి పథంలో దూసుకెళ్తోందని ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ షేక్ యూసఫ్ అలీ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం బ్యాంకు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 4,162 కోట్ల రుపాయలతో వ్యాపారాభివృద్ధిని కొనసాగిస్తోందని చెప్పారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 56 శాఖలు, 10 ఏటీఎంలు, 51 బిజినెస్ కరస్పాండెంట్లతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని వివరించారు. తక్కువ వడ్డీకే వివిధ రకాల రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. నూతనంగా ప్రారంభించిన ప్రగతి కుబేర్ 444 రోజుల పథకంలో భాగంగా సాధారణ ప్రజలకు 7.50 శాతం, మహిళా సూపర్ సీనియర్లకు అత్యధికంగా 8.30 శాతం వడ్డీ రేటు ఇస్తున్నామన్నారు. ఈ పథకం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో చీఫ్ మేనేజర్ ఎస్.కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

గుడ్లూరు: మద్యం మత్తులో ముగ్గురు యువకులు మధ్య జరిగిన ఘర్షణలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన గుడ్లూరులో సోమవారం రాత్రి జరిగింది. కొత్తపేటకు చెందిన బాలక్రిష్ణ,పాజర్లకు చెందిన మహేష్, సుబ్బారావు సోమవారం రాత్రి మద్యం కొనుగోలు చేసుకొని ఎంఎస్సార్ కాలేజీ వెనుక ఉన్న జామాయిల్ తోటలోకి వెళ్లి ఊటుగా మద్యం సేవించారు. మద్యంమత్తులో ఉన్న ముగ్గురు మధ్య మాటామాటా పెరిగడంతో ఘర్షణ పడ్డారు. దీంతో మహేష్,సుబ్బారావులు ఆవేశంగా బాలక్రిష్ణ పై దాడి చే సి తీవ్రంగా గాయపరచడంతో స్పృహతప్పి పడిపోయాడు. మంగళవారం ఉదయం స్పృహలోకి వచ్చిన బాలక్రిష్ణ గుడ్లూరులో ఉన్న అత్తగారింటికి వచ్చి విషయం చెప్పి ఇంటి ముందు పడిపోయాడు. దీంతో వెంటనే వారు కావలిలోని ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించారు. బాలక్రిష్ణ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్, సుబ్బారావుల అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాదరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బాలుడు

టంగుటూరు: నిమ్మకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన టంగుటూరు మండలం జయవరం ఎస్సీ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలుడు అమరపూడి సంతోష్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తన ఇంటి పైకి ఎక్కి నిమ్మకాయలు కోస్తుండగా 33 కేవీ విద్యుత్ తీగలు గాలికి వచ్చి నిమ్మచెట్టుకు తగలడంతో షాక్‌కు గురైన బాలుడు పెద్ద పెట్టున కేకలు వేసి పడిపోయాడు. అదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ భారీ శబ్దంతో పేలింది. కుటుంబ సభ్యులు ఇంటి పైకి ఎక్కి చూడగా బాలుడు కాలిన గాయాలతో పడి ఉన్నాడు. హుటాహుటిన తమ వాహనంలోనే టంగుటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. బాలుడి శరీరం 42 శాతం కాలిపోయిందని గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. బాలుకి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. ఎస్సీ కాలనీలో 33 కేవీ విద్యుత్ లైన్ 10 గృహాల మీదుగా తక్కువ ఎత్తులో వేలాడుతోందని అధికారులను చెప్పినా స్పందించకపోవడం వల్లే ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఆలకూరపాడు విద్యార్థిని


ఉపాధ్యాయులతో పూజిత

టంగుటూరు: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని సుదర్శి పూజిత ఎంపికైనట్లు పాఠశాల పీడీ వెంకట్రావు మంగళవారం తెలిపారు. 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్-17 బాలికల పోటీలు తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరాపల్లిలో గత డిసెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పూజిత జాతీయ స్థాయికి ఎంపికైందని చెప్పారు. ఆమెను హెచ్ఎం వాకా వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి


సంఘటనా స్థలంలో తిమోతి మృతదేహం

ఒంగోలు టౌన్: ఆగి ఉన్న లారీని వేగంగా వస్తున్న మోటారు బైకు ఢీకొన్న ఘటనలో నగరానికి చెందిన ఒక ప్రైవేటు కాలేజీ బస్సు డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని కొప్పోలు రోడ్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన నేలపాటి కిషోర్ తిమోతి(47) చైతన్య కాలేజి బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం రాత్రి బైకుపై చీరాల వెళ్లి ఒంగోలు వస్తున్నాడు. ఈ క్రమంలో కొప్పోలు పోతురాజు కాలువ ఫ్లయ్ ఓవర్ వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో కిషోర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంకొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వ్యక్తి విగతజీవిగా మారాడని తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

5 నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు


ఆహ్వానపత్రికను చూపుతున్న రవిచంద్ర, రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి

మార్కాపురం: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7వ తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రవిచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు జీఎల్ రమేషబాబు మంగళవారం తెలిపారు. మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు భాషాభిమాని, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ ఎస్ఎన్ రాజు సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆదికవి నన్నయ్య వేదికపై తెలుగు భాషలోని 25 ప్రక్రియలపై సదస్సులు, కవి సమ్మేళనంలో కవిత, గేయం, పద్యం, హైకూ, నానీలు, తెలుగు గజల్, తెలుగు రుబాయి, కథా పఠనాలకు అవకాశం కల్పిస్తున్నామని, నూతన గ్రంథావిష్కరణలకు స్వాగతం పలుకుతున్నామన్నారు. ఇంకా హరికథ, బుర్రకథ, యక్షగానం, అవధానం, పౌరాణిక, సాంఘీక నాటకాలు, వాగ్గేయకార, జానపద సంగీతం, ఆంధ్రనాట్యం, కూచిపూడి నృత్యాలు ఉంటాయన్నారు. వివిధ రంగాల్లో లబ్ధ ప్రతిష్ఠులకు రాజరాజ నరేంద్ర ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత వయోజన విద్య ఉప సంచాలకులు అన్నపురెడ్డి వీరారెడ్డి, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, వేణుగోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడి మృతి చెందిన అన్వర్‌బాషా

బేస్తవారిపేట: మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. బేస్తవారిపేట నుంచి తాటిచర్ల మోటు వైపునకు మోటారు సైకిల్‌పై మీ సేవ కేంద్రం నిర్వాహకుడు షేక్ అన్వర్‌బాషా, దింటకుర్తి వెంకట శ్రీనివాసులు వెళ్తున్నారు. అదే మార్గంలో ప్రొద్దుటూరు వెళ్తున్న కారు మోక్షగుండం సమీపంలో బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. అన్వర్‌బాషాకు రెండు కాళ్లు విరిగిపోగా, శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన అన్వర్‌బాషాను మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.